

బీసీ రాజ్యాధికార సభను విజయవంతం చేయండి

పెద్దపల్లి, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల14న ఉదయం 10 గంటలకు కరీంనగర్ సూర్యనగర్‌లో గల పద్మశాలి ఫంక్షన్‌హాల్‌లో జరిగే బీసీ రాజ్యాధికార సభను విజయవంతం చేయాలని గోపా ఉమ్మడిజిల్లా నాయకులు బుర్ర జగదీశ్వర్‌గౌడ్ ఒకప్రకటనలో తెలిపారు. ఈ సభకు బీసీ ఉద్యమకారులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, డాక్టర్ ప్రసన్న హరికృష్ణ, తదితరులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. బీసీలకు రాజ్యాధికారం సాధించే దిశగా అడుగులు వేసేందుకు సభలు నిర్వహిస్తున్నామని, ఈ సభకు బీసీ కులాలకు చెందిన నాయకులు, మేధావులు హాజరై బీసీల ఐక్యతను చాటాలని బుర్ర జగదీశ్వర్ గౌడ్ కోరారు.

క్రీడాకారుడికి సన్మానం

ఎలిగేడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ రేటింగ్ చదరంగం టోర్నమెంట్ పోటీలు ఆగస్టునెలలో విజయవాడలో జరిగాయి. మండలంలోని సుల్తాన్‌పూర్‌గ్రామానికి చెందిన అక్కినపల్లి విశృత్‌రామ్ ఇందులో రేటింగ్ సాధించడంతో శనివారం హైకోర్టు న్యాయవాది బుర్ర వీరస్వామి గౌడ్, రిటైర్డ్‌ఎంఈవో మాడూరిలచ్చయ్య సన్మానించి, మెమోంటోను బహూకరించారు. కార్యక్రమంలో భరోసా స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు, అడ్డగుంట తిరుపతి గౌడ్, కొమురవెల్లి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

- ఉత్తర్వులు జారీ చేయని రాష్ట్ర ప్రభుత్వం
- నీటి వనరుల లభ్యత, పంటల సాగుపై ఐదేళ్లకోసారి సర్వే
- ఒక్కో మండలంలో రెండు గ్రామాల్లో సర్వే చేస్తున్న ఎంపీఎస్‌వోలు



మత్తడి దూకుతున్న పెద్దపల్లి మండలంలోని బంధంకుంట చెరువు (ఫైల్)

చిన్న నీటి వనరుల సర్వేపై జాప్యం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ఉండే చిన్న నీటి వనరులు, ఇతర నీటి వనరుల లభ్యత, తద్వారా ఎంత విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయో ప్రతి ఐదేళ్ల గురించి చేపట్టే చిన్న నీటి వనరుల సర్వేలో జాప్యం జరుగుతున్నది. సర్వే ఆరంభించాలని కేంద్రప్రభుత్వం ముఖ్యప్రణాళిక శాఖాధికారులకు ఆదేశించినప్పటికీ, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది సహకారంతో ఈ సర్వే చేపట్టాల్సి ఉంటుంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తగిన ఉత్తర్వులు జారీచేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు జారీ కాలేదు. సర్వే కోసం పంచాయతీ కార్యదర్శిని గానీ, వ్యవసాయ విస్తీర్ణాధికారి గానీ, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను గానీ వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఎవరితో సర్వే చేపట్టాలనే విషయమై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. దీంతో జిల్లాలో చిన్న నీటి వనరుల సర్వేలో జాప్యం జరుగుతున్నది. మండలాల్లో పనిచేస్తున్న మండలపరిషత్ స్టాటిస్టికల్ ఆఫీసర్లచే రెండు గ్రామాల్లో సర్వే చేయాలని సీపీవో సూచించారు. ఆ గ్రామంలో ఉండే నీటివనరుల లభ్యత, తద్వారా సాగవుతున్న పంటల వివరాలను సేకరించాలని ఆదేశించారు. ప్రతి ఐదేళ్లకో సారి దేశవ్యాప్తంగా ఉన్న అన్నిగ్రామాల్లో గల చిన్న నీటి వనరులైన చెరువులు, కుంటలు, బావులు, బోరు బావులు, ఎత్తిపోతల పథకాల్లో ఉన్న నీటిలభ్యత, సాగవుతున్న పంటల వివరాల గురించి సర్వేచేస్తారు. ఇప్పటివరకు ఆరుసార్లు సర్వే నిర్వహించగా, ప్రస్తుతం చేపట్టనున్న సర్వే 7వసారి కావడం గమనార్హం. ఈసారి గ్రామాల్లోనే గాకుండా పట్టణాలు, వాటి పరిసరాల్లో ఉండే నీటివనరులపై కూడా సర్వే నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ సర్వే ఆధారంగా కేంద్రం ప్రభుత్వం దేశ అవసరాలకు, పంటల అవసరాలకు సరిపడా నీటి లభ్యత ఉందా, లేదా అని పరిశీలించనున్నారు. ఈ సర్వేను అనుసరించి నీటి వనరులను పెంపొం దించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి పలు పథకాలను అమల్లోకి తీసుకరానున్నారు.

● ఈసారి యాప్ ద్వారా సర్వే..

గ్రామాలు, పట్టణాల్లో గల చిన్న నీటివనరుల ద్వారా నీటిలభ్యత ఎంత ఉంది, వాటికింద ఎన్ని ఎకరాల భూములకు సాగు నీరు అందుతున్నాయి?. సాగు నీటి అవసరాలకే గాకుండా, తాగునీటి అవసరాలకు కూడా సద్వినియోగం అవుతున్నాయా, ఇతరత్రా అవసరాలకు కూడా సద్వినియోగం అవుతున్నాయా?. తదితర అంశాలపై సర్వే చేయనున్నారు. గతంలో మాన్యువల్‌గా కాగితాలపై సర్వే చేయగా, ఈసారి ఈ సర్వే కోసం రూపొందించిన యాప్ ద్వారానే సర్వే చేయనున్నారు. చిన్న నీటి వనరుల

(మిగతా 8వ పేజీలో)

అల్ట్రాటెక్‌లో ప్రథమ చికిత్స ట్రేడ్‌టెస్ట్



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పాలకుర్తి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్‌నగర్ అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలో మైన్స్‌సేఫ్టీ వీక్, ప్రొడక్టివిటీ అసోసియేషన్ 2025లో భాగంగా డీజీఎంఎస్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం ప్రథమచికిత్స ట్రేడ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్(ఎస్‌ఎంపీ) కింద జోన్-1(గ్రూప్‌బీ,సీమైన్స్)స్థాయిలో నిర్వహించారు. రాష్ట్రం నుంచి 8సిమెంట్ ప్లాంట్లకు చెందిన 45మంది ఈ ట్రేడ్‌టెస్ట్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ముఖ్య అతిథిగా హాజరై ప్లాంట్‌హెడ్ ఎం శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఆర్‌పి పార్థసారథి, మైన్స్‌హెడ్‌లను ప్రోత్సహించారు. అత్యవసర పరిస్థితుల్లో గోల్డెన్‌అవర్‌లో ప్రథమచికిత్స ఎంత ముఖ్యమో వివరించారు. మైన్స్‌హెడ్ సాహా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం ఎం రవి స్వాగత ప్రసంగంతో ప్రారంభమైంది. డాక్టర్లు రాము, నవీన్ టెస్ట్‌లు నిర్వహించారు. మేనేజర్ సుదర్శన్ రెడ్డి, కేవీఎస్ ప్రసాద్, పి సత్యనారాయణరావు, నేతృత్వంలోని మైన్స్ బృందం ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది.

యూరియా కొరతకు కేంద్రానిదే బాధ్యత



ఓదెలలో ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓదెల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ సాగర్ రెడ్డి అన్నారు. ఎస్‌బీఐ మినీబ్రాంచ్ గ్రామానికి మంజూరుకు కృషిపట్ల శనివారం మండలకేంద్రంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు చిత్రపటానికి కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. బాణసంచా పేల్చి సంబరాలు నిర్వహించిన అనంతరం ప్రేమ్ సాగర్‌రెడ్డి మాట్లాడుతూ, యూరియా ఎవరి ఆధ్వర్యంలో తయారు అవుతుందో తెలియకుండా నిరసనలు చేపట్టడం అవగాహన రాహిత్యమన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చీకట్ల మొండయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరిసేటి రాహుల్, మాజీ ఎంపీటీసీలు బోడకుంట స్వామి, బోడకుంట శంకర్, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, కోట నిరంజన్ రెడ్డి, డైరెక్టర్ చింతం కుమారస్వామి, జక్కుల వెంకటస్వామి, వంగ రాజమల్లు, పచ్చిమట్ల శ్రీనివాస్, వంగ శ్రీనివాస్, ఆసంశెట్టి కృష్ణ, మార్క సతీష్, పెరక సంఘం అధ్యక్షుడు కానుగంటి ఎర్ర శంకరయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ జయంతి



రాధ గోపికల వేషధారణలో చిన్నారులు

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో శనివారం వైష్ణవానం శ్రీకృష్ణ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారి అందమైన అలంకరణ, సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకుల్ని ఆకట్టుకున్నాయి. ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ అల్లెంకి రజనీదేవి, ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఆపన్నహస్తం

కమాన్‌పూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన మహ మ్మద్ ఖాదీర్ సాదిక్‌కు జన్మించిన కుమారుడు గుండె, లివర్ తదితర సమస్యలతో పుట్టాడు. దీంతో ఆ కుటుంబం బాలుడి ఆసుపత్రి వైద్యం కోసం ఆపన్నహస్తం అందించాలని వేడుకున్నారు. ఆసుపత్రి వైద్యఖర్చులకు రూ.3లక్షల వరకు అవుతుండగా కుటుంబం నిస్సహాయతను చూసి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చింది. ఈసందర్భంగా వారు అందరిసభ్యులతో కలిసి రూ.61,500 లను జమచేసి శనివారం ఆ మొత్తాన్ని ఎస్ఐ ప్రసాద్‌చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందించారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎస్సీ బాలురవసతి గృహంలో శనివారం వసతిగృహ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఇందులో ఏఎన్‌ఎం సరోజన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి సత్యనారాయణ, వసతిగృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొడ్డెమ్మ పూజలు ప్రారంభం

● వాడవాడలా బతుకమ్మ సంబరాలు



బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు

సుల్తానాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న బతుకమ్మ పండుగలో భాగంగా శనివారం బొడ్డెమ్మ పూజలు నిర్వహించారు. స్థానిక శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయాలతోపాటు వాడ వాడలా బొడ్డెమ్మను ప్రతిష్ఠించిన మహిళలు చక్కని పాటలతో ఆడుకున్నారు. ఈ సందర్భంగా అందుబాటులో ఉన్న పూలతో బతుకమ్మలను తయారు చేసి సామూహికంగా బతుకమ్మ పాటలను పాడుతూ ఆడారు. తొమ్మిదిరోజులపాటు బొడ్డెమ్మ వేడుకలు కొనసాగుతాయని, అమావాస్య నుంచి చిన్నబతుకమ్మ వేడుకలు ప్రారంభమవుతాయని పండితులు వల్లంకొండ మహేష్ తెలిపారు. శివాలయంలో జరిగిన బొడ్డెమ్మ ప్రారంభ పూజల్లో ఆలయచైర్మన్ అల్లంకి సత్యనారాయణ భాగ్యలక్ష్మి, అరుణ్, శివలీల, అన్నపూర్ణ, వనతి, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

● సాంఘిక సంక్షేమశాఖ అధికారి మేకల మల్లేశం

సుల్తానాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తున్న వసతి సౌకర్యాలను ఇతర ప్రయోజనాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నతలక్ష్యంతో ముందుకు సాగాలని సాంఘిక సంక్షేమశాఖ అధికారి మేకల మల్లేశం అన్నారు. సుల్తానాబాద్ ఎస్సీ బాలుర కళాశాల వసతిగృహంలో శనివారం రాత్రి పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనగా, వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యంతో ముందుకు సాగుతూ, తల్లిదండ్రులకు, అధికారులకు, గురువులకు మంచి పేరు తేవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హాస్టల్ ఉద్యోగులు, మాజీ వార్డుసభ్యుడు గిరుగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు..



మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని, కూల్చివేతలతో చిరు వ్యాపారులను రోడ్డున పడవేస్తున్నారని రామగుండం మాజీఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారపార్టీ నాయకులకు చట్టాలు చుట్టాలుగా మారాయన్నారు. రోడ్డువెడల్పుల పేరుతో జరుగుతున్న కూల్చివేతలు చిరువ్యాపారులకు నష్టం కలిగిస్తున్నాయని, రామగుండంలో అరాచక పాలన కొనసాగుతుందన్నారు. చిరువ్యాపారులకు నష్టపరిహారం చెల్లించాలని, ప్రణాళికలు లేకుండాకూల్చివేయడం సరికాదన్నారు. రామగుండంలో కూల్చివేతలను వెంటనే ఆపివేయాలని డిమాండ్‌చేస్తూ ఈనెల 15న గోదావరిఖని బంద్‌కు పిలుపునిస్తున్నట్టు, చలోకలెక్టరేట్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్టు చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కౌశిక హరి, కుమ్మరి శ్రీనివాస్, బాదె అంజలి, బొడ్డు రవీందర్, మారుతి, శ్రీనివాస్, మెతుకు దేవరాజ్, సట్టు శ్రీనివాస్, కోడి రామకృష్ణ, కనక లక్ష్మి, శ్రావణ్ పాల్గొన్నారు.

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలి



ఎలిగేడులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఎలిగేడు/ముత్తారం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఫొటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం, ఫొటోటెక్, ఎడిట్ పాయింట్ సంయుక్తంగా ఈనెల19, 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలని ఫొటో,వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఎలిగేడు, ముత్తారం మండలకేంద్రాల్లో ఎక్స్‌పో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఫొటో,వీడియోగ్రాఫర్లు తమ నైపుణ్యాన్ని పెంచుకునేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్ఫాన్, జిల్లా కోశాధికారి అల్లం సతీష్, సలహాదారులు కట్ల తిరుపతి, విజయ్, మల్లేశం, మండల అధ్యక్షుడు ముంజంపల్లి శ్రావణ్, ప్రధానకార్యదర్శి సంతోష్, కోశాధికారి శ్రీనివాస్, మహేందర్, శివ, శ్రీధర్, నాగరాజు, పవన్, గణేష్‌తో పాల్గొన్నారు. అనంతరం ఫొటోగ్రాఫర్లను మాజీ వైస్‌ఎంపీపీ, హైకోర్టు న్యాయవాది బుర్ర వీరస్వామిగౌడ్ సత్కరించి, మెమోంటోలను అందించారు. ముత్తారంలో జరిగిన కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి ఇర్ఫాన్, కోశాధికారి అల్లం సతీష్, ముత్తారం మండల వ్యవస్థాపక అధ్యక్షుడు అనుమ వీరస్వామి, మండల అధ్యక్షుడు వైద్య రాజేందర్, కోశాధికారి సముద్రాల రాజేందర్, గుట్ల తిరుపతి, సముద్రాల శంకర్, రాజు, క్రాంతి, ప్రశాంత్‌పాల్గొన్నారు.

ధర్మారంలో అంబేడ్కర్ స్టడీ సెంటర్

ధర్మారం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దూరవిద్యలో డిగ్రీ చదివేందుకు ధర్మారం మండల కేంద్రలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని సాధన డిగ్రీ కళాశాలలో ఈ స్టడీసెంటర్‌ను ఏర్పాటు చేశామని, చదువును మధ్యలో మానేసిన విద్యార్థులు, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎంబడి తిరుపతి ఒక ప్రకటలో తెలిపారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

కోల్‌సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎఫ్‌సీఎల్, ఎన్‌టీపీసీ టౌన్‌షిప్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లాఅధ్యక్షుడు కొంటుసాగర్ డిమాండ్ చేశారు. శనివారం సెలవుదినం అయినప్పటికీ పాఠశాలలను నడపడం సరైంది కాదన్నారు. దీంతో స్కూల్ యాజమాన్యం 11గంటలకు విద్యార్థులకు ఇంటికి పంపించారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు హర్షిత్ అన్నారు. శనివారం జవహర్‌నగర్‌లో మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 150మందికి ఉచితంగా 2డీ ఎకో, ఈసీజీ, బీపీ, మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీష్, కొండ రమేష్, అన్వర్, రమేష్ పాల్గొన్నారు.

సేవా పక్వాడా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

సుల్తానాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా నిర్వహించే సేవా పక్వాడా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సేవాపక్వాడా జిల్లా కోకన్వీనర్ మిట్టపల్లి ప్రవీణ్ కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. శనివారం సుల్తానాబాద్ రూరల్ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా కోకన్వీనర్ మిట్టపల్లి ప్రవీణ్, మండల కన్వీనర్ ఊషణ అన్వేష్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ పట్టణంలోని సేవాపక్వాడా కార్యశాల సమావేశం జరిగింది. పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చినా దానిని చిత్తశుద్ధితో కలిసి కట్టుగా విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రెసంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 17నుంచి అక్టోబర్ 2వరకు సేవేలక్ష్యంగా పలుసేవా కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీసీనియర్ నాయకులు కడారి అశోక్‌రావు, సొదరి మహేందర్‌యాదవ్, కొమ్ము తిరుపతి, రఘుపతిరావు, చాతరాజు రమేష్, ప్రధాన కార్యదర్శులు కొల్లూరి సంతోష్, కోటనాగేశ్వర్, సేవాపక్షం కో కన్వీనర్లు సంతోష్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, నాయకులు మల్క భాగ్యలక్ష్మి, పెర్క రమేష్, ఎగురం రామస్వామి, వడ్లకొండ మహేష్ గౌడ్, పసెడ్ల రాజు, శేఖర్, శశి వర్ధన్‌గౌడ్, నల్లవెల్లి శంకర్, వేణు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

● ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్



మనాలి ఠాకూర్‌కు గాజులు తొడుగుతున్న మహిళలు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశ సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడు కోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్ అన్నారు. శనివారం గోదావరిఖని గంగానగర్‌లో మహిళలతో కలిసి గాజుల పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు చిన్ననాటి నుంచే మనపండుగలు, సంప్రదాయాలను నేర్పించాలన్నారు. సంప్రదాయాలవల్ల ఐక్యత పెరుగుతుందని, ప్రతిపండుగను అందరూ కలిసి కట్టుగా జరుపుకుంటే బంధాలు బలపడతాయని అన్నారు. మహిళలు ఒకరికొకరు గాజులు తొడక్కుంటూ శుభాకాంక్షలు తెలిపారు.

రామగుండం సమగ్రాభివృద్ధి నా లక్ష్యం

● ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్



రోడ్డు వెడల్పు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

అంతర్గాం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే నా ప్రధాన లక్ష్యం అని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ అన్నారు. శనివారం రామగుండం బీ పవర్‌హౌజ్ గడ్డ నుంచి లింగాపూర్, పట్టణంలోని పోస్టాఫీస్ వరకు చేపడుతున్న రోడ్డు వెడల్పు పనులను పరిశీలించి మాట్లాడారు. సాధ్యమైనంత త్వరగా రోడ్డు వెడల్పు, అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ తాగు నీటి పైపులైనుకు సంబంధించి అధికారులతో సమీక్షించారు. రామగుండం పట్టణంలోని నాలుగు డివిజన్‌లలో త్వరలోనే రూ.20కోట్ల నిధులతో అభివృద్ధిపనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దీటి బాలరాజు, మహంకాళి స్వామి, పెండ్యాల మహేష్, ఈదునూరి హరిప్రసాద్, బల్వాన్‌సింగ్, సలీంబేగ్, మహమ్మద్, అధికారులు నవీన్, గఫూర్, జావేద్ పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు సొంతింటి కలను నెరవేర్చాలి

● సొంతింటికి 21836మంది ఓటింగ్ వేశారు.. ● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల రాజిరెడ్డి

గోదావరిఖని, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు సొంతింటి కలను నెరవేర్చాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సొంతింటి కల పోలింగ్‌కు 99శాతం మంది కార్మికులు సొంతఇల్లు కావాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని, పోలింగ్‌లో 22,068మంది కార్మికులు ఓటింగ్‌లో పాల్గొనగా 21836మంది సొంత ఇల్లు కావాలని అభిప్రాయం వ్యక్తం చేశారన్నారు. కార్మికులకు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలని మొదటి నుంచి సింగరేణి యాజమాన్యంతో సీఐటీయూ పోరాటం చేస్తుందని, యాజమాన్యం కొత్త క్వార్టర్ల నిర్మాణాలను నిలుపుదల చేసి కార్మికులకు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలని, అవసరమైతే ఇతర కార్మిక సంఘాలతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో సీఐటీయూ నాయకులు మెండె శ్రీనివాస్, బిక్షపతి, ఆశ్రి మహేష్, వేణుగోపాల్‌రెడ్డి, గౌస్, శంకర్, శివరాంరెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, జనార్ధన్, వేణు, సందీప్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వాగులో పడి యువకుడి మృతి


రాజ్‌కుమార్ (ఫైల్)

ధర్మపురి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన వీరవేణి రాజ్‌కుమార్ (22) అనే యువకుడు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందాడు. ధర్మపురి పట్టణంలోని ముదిరాజ్‌వాడకు చెందిన వీరవేణి రాజ్‌కుమార్ కమలా పూర్‌లోని ఫిల్టర్ బెడ్‌లో ఆరు నెలలుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 11న రాత్రి పనికి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి వీరవేణి అమృత శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పోలీసులు రాజ్‌కుమార్ కోసం వెతుకుతుండగా మృతదేహం శనివారం ఉదయం వాగులో కనిపించింది. రాజ్‌కుమార్ తన విధుల్లో భాగంగా కమలాపూర్ చివరిలో గల ఫిల్టర్ బడ్ వద్దకు చేరుకునే క్రమంలో వాగులో ప్రమాద వశాత్తు పడి మృతి చెందాడు. మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి పంపించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..


తాళ్ల కార్తిక్(ఫైల్)

గంగాధర, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గంగాధరర మండల కేంద్రానికి చెందిన తాళ్ల కార్తీక్ (19)యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం తాళ్ల కార్తీక్ కొంతకాలంగా మద్యానికి బానిసై తరుచు కుటుంబసభ్యుతో గొడవ పడుతుండేవాడు. ఈక్రమంలో గతంలో కుటుంబసభ్యులతో గొడవ పడి డిష్ వైర్‌తో ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు గమనించి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఈనెల 12న తన పుట్టిన రోజు సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నాడు. రాత్రి అతిగా మద్యం సేవించి కుటుంబసభ్యులతో గొడవ పెట్టుకుంటూ ఆత్మహత్య చేసుకుని చనిపోతానని బెదిరించాడు. రాత్రి అందరు ఎప్పటిలాగే పడుకుని తెల్లారి లేచి చూసే సరికి గదిలో మరణించి ఉన్నట్లు కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. విచారణలో భాగంగా చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్ ఎస్సై వంశీకృష్ణ, కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాల అసిస్టెంటు ప్రొఫెసర్ శేఖర్‌రావు, వైద్య బృందం గంగాధరలో ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ప్రమాదవశాత్తు గాయపడ్డ వ్యక్తి.. చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గద్దపాకలో ప్రమాదవశాత్తు గాయపడ్డ ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గద్దపాక గ్రామానికి చెందిన నిమ్మరాజు రాజు (55) అనే వ్యక్తి ఈ నెల 9న రాత్రి నీళ్లు తాగడానికి లేచి నిద్రమత్తులో నీళ్లు తాగుతుండగా కాలు జారీ ఇంట్లో ప్రమాదవశాత్తు పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం కాగా కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతిడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలల్లో కానరాని క్రీడలు

- ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు
- అలనాటి క్రీడలు కనుమరుగు


కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠ శాలల్లో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. అలనాడు ఆడిన ఆటలు పాఠశాలల్లో నేడు కానరావడం లేదు. గతంలో ప్రభుత్వ పాఠశాల ల్లో చదువుకునే విద్యార్థులు 7నుంచి 10వ తరగతి వరకు పీఈ టీలు ఉండేవారు. ప్రైవేటు పాఠశా లలు లేని కారణంగా అందరూ ప్రభు త్వ పాఠశా లల్లోనే చదువుకునేవారు. దీంతో ఒక్కొక్క క్లాసులో వంద నుంచి 120మంది విద్యార్థుల వరకు ఉండేవారు. కాగా వారిని మూడు భాగాలుగా విభ జించి ఉపాధ్యాయులు క్లాసులు బోధించేవారు. అలాగే ప్రతిరోజు సాయంత్రం మూడు గంటల సమయం నుంచి 5.30గంటల సమయం వరకు పీఈటీలు విద్యార్థులకు ఆటలు ఆడించేవారు. గతంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, షాట్‌పుట్, అథ్లెటిక్స్, జావెల్‌త్రో, టేబుల్ టెన్నిస్ తదితర ఆటలు పీఈటీలు ఆడించేవారు. ఆటల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయికి ఆడించిన సంఘటనలు ఉన్నాయి. గ త ం లో ఉపా ద్యాయులు స్థానికంగా ఉం డటం ఒక కారణమైతే, పాఠశాలకు సమయాని కంటే ఒక గంట ముందే వచ్చేవారు. అలాగే పాఠశాల అయిపోగానే విద్యార్థులతో కలిసి సాయంత్రం ఆటలు ఆడేవారు. ప్రస్తుతం ఉపాధ్యా యులు సుదూర ప్రాంతా లైన హనుమకొండ, కరీం నగర్, పెద్దపల్లి, జమ్మి కుంట తదితర పట్టణాలనుంచి వస్తూ, హడావుడిగా వెళ్లిపోతున్నారు. గతంలో ఉపాధ్యాయులు స్థానికంగా ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పలుక్రీడలు ఆడేవారు. మండల కేంద్రంలోని ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో గతంలో పనిచేసిన పీఈటీ సంపత్ కుమార్, మైస య్య, ఇంద్ర సేనారెడ్డి, కూనారంలో రాజ నర్సులు ఇలా పలువురు వ్యాయా మ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆటలు నేర్పించి, ఆ విద్యార్థులను జాతీ య స్థాయి క్రీడల్లో ఎంపికయ్యేలా తీర్చిదిద్దారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు పలువురు స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ కొలువుల్లో పని చేస్తున్నారు. మండలంలో 11 ఉన్నత పాఠశాలలు ఉన్నా కేవలం ఆ పాఠశాలల్లో 312 మంది విద్యార్థులు ఒకటి నుంచి ఏడు వరకు ఉన్న 34ప్రభుత్వ పాఠశాలల్లో 1147మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అలాగే 179మంది ఉపాధ్యాయులు మండ లంలోని ఆయా పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్నారు. కాల్వ శ్రీరాంపూర్, పెగడపల్లిలో ఇద్దరు పీఈ టీలు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో విద్యార్థులు సాయంత్రం 3గంటల వరకు ఆయా సబ్జెక్టుల్లో విద్యాబోధన, అనంతరం ఆ తదుపరి ఆటలు ఆడటం వల్ల మానసికంగా విద్యతోపాటు శారీరక శ్రమ అలసటతో విద్యార్థులు ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండేవారు. గతం లాగానే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులను నిష్ణాతులుగా తయారు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజు విద్యార్థులకు వారి ఇష్టమైన ఆటలు ఆడించేలా మైదా నంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి క్రీడల్లో జాతీయస్థాయి క్రీడాకారులుగా తయారు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మండల ప్రజలు తమ అభిప్రాయలను వ్యక్తం చేస్తున్నారు.



రాష్ట్రస్థాయిలో ఖోఖో ఎన్నోసార్లు ఆడాను..



- సబ్బని శ్రీనివాస్, పూర్వవిద్యార్థి, పెగడపల్లి

కాల్వశ్రీరాంపూర్ ఉన్నతపాఠశాలలో తాను 1982లో 10వతరగతి వరకు చదువుకున్నాను. చదువుతోపాటు ఆటలు ఆడుకునేవాళ్లం. ఖోఖోలో రాష్ట్రస్థాయిలో ఆడాను. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో గ్రామీణ క్రీడలు కానరావడం లేదు.

జాతీయ స్థాయిలో కబడ్డీ ఆడాను..



- అల్లం దేవెందర్, పూర్వవిద్యార్థి, కాల్వశ్రీరాంపూర్

మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999లో 10వ తరగతి వరకు చదువుకున్నా. నేను కబడ్డీలో జాతీయస్థాయిలో ఎంపికై ఢిల్లీలో కూడా కబడ్డీ ఆడాను. తాము చదువుకునే సమయంలో గ్రామీణ క్రీడలకు కూడా ప్రాధాన్యత ఉండేది. ప్రస్తుతం పాఠశాలల్లో ఆటలు కానరావడం లేదు.

పురుగుల మందు డబ్బాతో వ్యక్తి ఆందోళన

హుజూరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దాసరి సదానందం అనే వ్యక్తి ఆస్తిలో వాటా డబ్బులు ఇవ్వకుండా సోదరులు తనని ఇబ్బంది పెడుతున్నారని శనివారం పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సదానందంను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సోదరులు ఉమ్మడి ఆస్తి విక్రయించగా తనకు ఐదు లక్షలు రూపాయలు ఇవ్వాలన్నారు. తన కూతురు వివాహం ఉన్నందున డబ్బులు ఇవ్వమంటే తన అన్నదమ్ములు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దీంతో తాను ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలిపారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న వ్యక్తికి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ఎల్లారెడ్డిపేట మండలం బండ లింగంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి గూడూరి మనోహర్‌పై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల పాటు రిమాండ్ విధించారని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి శనివారం పేర్కొన్నారు. ఈనెల 12న అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న క్రమంలో పట్టుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామని చెప్పారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమాని మనోహర్‌కు 14 రోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పును వెల్లడించారని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి హెచ్చరించారు.

యువకులకు గంజాయి పరీక్షలు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలోని పలు ఇళ్లలో ఎస్‌ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు శనివారం సోదాలు నిర్వహించారు. ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఇద్దరు అనుమానిత యువకులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి రాపిడ్ పరీక్షలు నిర్వహించామని ఎస్‌ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు.

ఖాతాలో నుంచి రూ.70 వేలు మాయం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరస్థులు అదును దొరికితే చాలు.. అమాయకుల ఖాతాల్లోంచి డబ్బులను క్షణాల్లో మాయం చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని ఓ వ్యక్తి ఇటీవల ఏఐ ట్రెండ్‌తో వచ్చిన యాప్‌లో తన ఫోటోను అప్‌లోడు చేశాడు. ఆ క్రమంలో సదరు వ్యక్తి సెల్‌ఫోనుకు వచ్చిన లింక్‌పై క్లిక్ చేయడంతో సైబర్ నేరస్థులు ఆయన ఖాతాలో నుంచి రూ.70వేలను మాయం చేశారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు పేర్కొన్నారు.

తాళం పగలగొట్టి.. పట్ట పగలే చోరీ

శంకరపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో తాళం పగలగొట్టి పట్ట పగలే చోరీ చేసిన సంఘటన శనివారం శంకరపట్నం మండలం మెట్‌పల్లిలో జరిగింది. బాధితుడు, గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మెట్‌పల్లి గ్రామానికి చెందిన బియ్యాల కృష్ణ అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి వ్యక్తిగత అవసరాల నిమిత్తం కరీంనగర్ వెళ్లగా, కుటుంబ సభ్యులు అదే గ్రామంలో బంధువుల అంత్యక్రియలకు వెళ్లారు. మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి ఇంటర్నెట్ షాపు నిర్వహణకు ఉపయోగించే లాప్‌టాప్, ఇన్వెర్టర్ ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. వాటి విలువ సుమారు 30వేల రూపాయల వరకు ఉంటుందని, చోరీపై కేశవపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు. కాగా గ్రామంలోని మరో రెండు ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించినట్లు సమాచారం.

గంజాయి అమ్మినా, కొన్నా కఠిన చర్యలు

- అసాంఘిక శక్తులపై సమాచారం ఇవ్వండి - గోదావరిఖని ఏసీపీ మడక రమేష్


కాలనీవాసులతో మాట్లాడుతున్న గోదావరిఖని ఏసీపీ రమేష్

కోల్‌సిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక శక్తులపై సమాచారం ఇవ్వాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని గోదావరిఖని ఏసీపీ మడక రమేష్ హెచ్చరించారు. గోదావరిఖని రాంనగర్, సీతానగర్, కృష్ణనగర్, లెనిన్‌నగర్, 2ఏ మోరీ, ఆర్‌సీఓఏ క్లబ్ ప్రాంతంలో శనివారం ఏకకాలంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లను సోదా చేయడంతో పాటు సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ పనిచేసే కూలీలు ఎక్కువ మంది నివసిస్తున్నారని, వారికి కిరాయి ఇళ్లు ఇచ్చే వారు వారి పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. యువత గంజాయికి బానిసలవుతున్నారని, గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా గంజాయి విక్రయించినట్టు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మైనర్లకు మోటార్‌సైకిల్ ఇవ్వవద్దని, ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేసి ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోవద్దని సూచించారు. చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారాన్ని తెలిపితే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కాలనీవాసులకు సూచించారు. తనిఖీల్లో గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు ఇంద్రసేనారెడ్డి, రవీందర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు, ఎస్‌ఐలు రమేష్, భూమేష్, అనూష, నవీన్, రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కట్ల సతీష్ కస్టడీ కోరుతూ పోలీసుల పిటిషన్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే మూడు నెలల్లో మూడింతలు డబ్బులు వస్తాయని పలువురి వద్ద కోటి రూపాయలకుపైగా వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాలో గురువారం నమోదైన కేసులో నిందితుడు మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కట్ల సతీష్‌ను పోలీసు కస్టడీకి అనుమతించాలంటూ కరీంనగర్ రూరల్ పోలీసులు శనివారం కరీంనగర్ కోర్టులో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో కట్ల సతీష్‌ను శుక్రవారం అరెస్టు చేసి జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు నిందితుల్లో మరో ఇద్దరు పరారీలో ఉండగా ఇద్దరిని ఇప్పటికే సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. అయితే క్రిప్టో కరెన్సీ మెటాఫండ్ పేరిట ఫేక్ ఐడీలు సృష్టించి భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు బాధితులు కరీంనగర్ రెండో ఠాణా, కరీంనగర్ రూరల్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి మరింత లోతుగా విచారణ చేయాల్సి ఉందని, నిందితుడు కట్ల సతీష్‌ను నాలుగు రోజులు పోలీసు కస్టడీకి అనుమతి ఇవ్వాలని పోలీసులు పిటీషన్ దాఖలు చేశారు. ఫేక్ క్రిప్టో కరెన్సీ దందాలో వ్యాపారులు, సామాన్య ప్రజలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులుకూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. 100 కోట్లపైగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో కస్టడీకి తీసుకుని పెట్టుబడిపెట్టిన వ్యక్తుల వివరాలు తెలుసుకోవాలని పోలీసులు భావిస్తున్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత


బోయినపల్లిలో పట్టుకున్న రేషన్ బియ్యంతో పోలీసులు

బోయినపల్లి సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంటిలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు బోయినపల్లి ఎస్సై రమాకాంత్ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... మండల కేంద్రంలోని ఒక పాత ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు వెంటనే అక్కడికి వెళ్లి కోనరావుపేట మండలం కొండపూర్ గ్రామానికి చెందిన పెద్దగంటి అంజయ్యను పట్టుకొని అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీణవంక: మండల కేంద్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణ చేస్తున్నారన్నా సమాచారం మేరకు లోకిని స్వామి ఇంటిపై పోలీసులు దాడి చేయగా 12 బస్తాల బియ్యం బస్తాలు లభించినట్టు పోలీసులు తెలిపారు. దాదపు ఐదు క్వింటాళ్ల బియ్యం అక్రమ రవాణకు సిద్ధంగా ఉండడంతో వాటిని పట్టుకొని లోకిని స్వామిపై కేసు నమెదు చేసినట్టు ఎస్‌ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండల పరిధిలోని గొల్లపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్‌లను శనివారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అదుపు తప్పి ఇటుక ట్రాక్టర్ బోల్తా

శంకరపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం గ్రామంలో ఇటుక ట్రాక్టర్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి శనివారం బోల్తా పడింది. గ్రామస్థుల సమాచారం మేరకు మానకొండూర్ మండలం కొండపల్కల గ్రామం నుంచి ఇటుకను ట్రాక్టర్‌లో శంకరపట్నం మండలం ధర్మారంలో ఇంటి నిర్మాణానికి తరలిస్తున్నారు. ధర్మారం గ్రామ శివారులో భారీ వర్షాలతో రోడ్డు కుంగిపోవడంతో ప్రమాదవశాత్తు అదుపుతప్పి ఇటుక ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయలు కాలేదు.

దేవాలయాల్లో వరుస దొంగతనాలు

- వారం వ్యవధిలో మూడు ఆలయాల్లో చోరీ


గోపాల్‌రావుపేట గుడిలో హుండీ పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లిన నిందితులు

ధర్మారం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో వారం రోజుల వ్యవధిలో మూడు దేవాలయాల్లో వరుస దొంగతనాలు జరిగిన సంఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. శుక్రవారం రాత్రి నందిమేడారంలోని అమరేశ్వరస్వామి దేవాలంలోకి చొరబడిన దొంగలు గుడి తాళాలు పగుల గొట్టి హుండీ ఎత్తుకెల్లారు. గుడిచెర్మన్ పోలీసులకు ఇచ్చిన సమాచారంతో కానిస్టేబుల్ రాజు ఆలాయానికి వచ్చి వివరాలు సేకరించినట్లు సమాచారం. ఈనెల ఏడో తేదీన ఆదివారం రాత్రి గోపాల్‌రావుపేట గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా దొంగలు పడి హుండీని పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. దీనితో పాటు 10న, బుధవారం రాత్రి మేడారం ఎస్సీ కాలనీలో మేన్‌రోడ్‌కు ఆనుకొని ఉన్న హనుమాన్ టెంపులో కూడా దొంగలు హుండీ పగులగొట్టి నగదు దోచుకెళ్లినట్లు సమాచారం. ఇన్ని వరుస సంఘటనలు జరుగుతున్నప్పటికీ ఆయా గ్రామాల్లోని ప్రజలకు కూడా గుడిలో దొంగలుపడినట్లు తెలియపోవడం గమనార్హం.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వెల్గటూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గరికి గాయాలయ్యాయి. ధర్మారం మండలం మేడారం, కటికెనపల్లికి చెందిన వెంకటేష్, సంతోష్, మల్లేష్ అనే యువకులు ద్విచక్రవాహనంపై వెల్గటూర్ వైపు నుంచి ధర్మారం వైపు వెళ్తుండగా అదుపు తప్పిపడిపోయింది. దీంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.


సంఘటనా స్థలంలో క్షతగాత్రులు

జీడీకే 11 ఇంక్లైన్ బొగ్గుబాయిపై దొంగతనం

- రూ.10 లక్షల సామగ్రి అపహరణ
- ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు?

గోదావరిఖని, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల క్రితం జీడీకే 2ఇంక్లైన్‌లో దొంగలు పడ్డ సంఘటన మరువక ముందే ఇదే ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే ఇంక్లైన్‌లో భారీ దొంగతనం జరిగింది. గనిలోని లాంగ్‌వాల్ షెడ్‌లో చోరీ జరిగినట్టు రెండు రోజుల క్రితం అధికారులు గుర్తించారు. దీంతో విధుల్లో ఉన్న ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్టు సమాచారం. 11ఇంక్లైన్ లాంగ్ వాల్‌షెడ్ స్టోర్‌లో పైకప్పు రేకులు తొలగించి లోపలికి చొరబడిన దొంగలు విలువైన కాపర్ కేబుళ్లు, విలువైన ఇత్తడి సామగ్రిని దొంగించినట్టు అధికారులు గుర్తించారు. దొంగిలించిన సామగ్రి విలువ రూ.10లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.


జీడీకే 11ఇంక్లైన్ స్టోర్ పైకప్పు రేకులు పగుల గొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

తెగిపోయిన ఇందుర్తి ఎల్లమ్మ వాగు రోడ్డు

- పట్టించుకోని అధికారులు - మరమ్మతులు చేసిన ప్రయాణికులు


తెగిన రోడ్డును మర్మత్తు చేస్తున్న ప్రయాణికులు


రోడ్డు తెగిపోవడంతో వెనుదిరిగి వెళ్తున్న ఆర్టీసీ బస్సు

చిగురుమామిడి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుర్తి ఎల్లమ్మ వాగు వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో కోహెడ-చిగురుమామిడి మండలాల ప్రజల రాకపోకలు నిలిచి పోయాయి. అనేక మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా మండలాల ప్రజలు అధికారుల తీరుపై విమర్శలు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు స్వయంగా శ్రమదానం చేసి రోడ్డును మరమ్మతు చేశారు. ఇదే సందర్భంలో అక్కడికి వచ్చిన ఆర్టీసీ బస్సు రోడ్డు దెబ్బతినడంతో బస్సు వెనుదిరిగి వెళ్లిపోయింది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు పట్టించుకొని వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆయా మండలాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎల్‌ఎండీలో మత్స్యకారుడి వలకు చిక్కిన 'సిల్వర్ ఫిష్'



తిమ్మాపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేపలు పట్టేందుకు మండలంలోని దిగువ మానేరు జలాశయంలోకి వెళ్లిన మత్స్యకారుడి వలకు ఓ అరుదైన చేప చిక్కింది. మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామానికి చెందిన బోళ్ల భూమయ్య అనే మత్స్యకారుడు చేపలు పట్టుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటాడు. రోజు వారిలోగే శనివారం ఉదయం కూడా చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపల కోసం వల వేయగా 20 కిలోల చేప చిక్కింది. ఈ చేపను సిల్వర్ ఫిష్‌గా పిలుస్తారని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఇది చైనాకు చెందిన జాతి అని చైనా నుంచి తీసుకువచ్చి మన దేశంలో పెంచుతున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాల్లో నాలుగు నుంచి ఐదు కిలోల వరకు పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ చేపల్లో ముళ్లు అధికంగా ఉంటాయన్నారు. వర్షాలతో, వరదల కారణంగా ఎగువ నుంచి ఈ చేప ఎల్‌ఎండీలోకి వచ్చి చేరినట్లు అధికారులు తెలిపారు. అయితే ఇది ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువగా ఉంటుందని మరికొందరు చెబుతున్నారు.

బాలికను వేధించిన వ్యక్తి రిమాండ్

శంకరపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాలికను వేధించిన వ్యక్తికి జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అంబాలాపూర్ గ్రామానికి చెందిన రావనవేణి హరీష్ ఓ బాలిక వెంబడించి వేధించాడు. ఈ సంఘటనపై ఫిర్యాదు రాగా పోలీసులు రావనవేణి హరీష్‌ను అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా 14 రోజుల జ్యుడిషల్ రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.



- కరీంనగర్, రామగుండంలో ఏర్పాటుకు అనుమతి
- కరీంనగర్ ఎక్సైజ్ డీసీ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 25న చివరి గడువు

ద్వితీయశ్రేణి నగరాల్లో మైక్రో బ్రూవరీలు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీరు ప్రియులకు కిక్కిచ్చే మైక్రో బ్రూవరీలు ఇక ద్వితీయశ్రేణి నగరాల్లో ఏర్పాటు కానున్నాయి. బీర్లు కొనుగోలు చేయాలంటే ఇక నుంచి వైన్‌షాపుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇప్పటి వరకు రాష్ట్ర రాజధాని వంటి పెద్ద పట్టణాలకే పరిమితమైన మైక్రో బ్రూవరీ యూనిట్లను ద్వితీయశ్రేణి నగరాలు తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్) కరీంనగర్, రామగుండం వంటి మున్సిపల్ కార్పొరేషన్లలో ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మైక్రో బ్రూవరీలను ఏర్పాటు చేసుకుని, వ్యాపారం కొనసాగించుకునేందుకు తెలంగాణ ఎక్సైజ్ శాఖ లైసెన్స్‌లను జారీ చేయనున్నది. కరీంనగర్, రామగుండంలో మైక్రో బ్రూవరీ యూనిట్లు ఏర్పాటుకు ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ అయింది. ఇప్పటి వరకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మాత్రమే 18 వరకు మైక్రో బ్రూవరీలు నడుస్తున్నాయి. ఇప్పుడు కరీంనగర్, రామగుండంతో పాటు మరికొన్ని మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. హోటళ్లు, రెస్టారెంట్లు, బార్‌లలు, ఎలైట్ బార్‌లు, క్లబ్‌ల వంటి ఇదివరకే లైసెన్స్ కలిగిన ప్రాంగణాల్లో ఏర్పాటు చేసుకోవచ్చు. కొత్త స్థలాల్లోనూ నిబంధనల మేరకు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇస్తుంది.

● విధి విధానాలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లలో మైక్రోబ్రూవరీల ఏర్పాటుకు ఆసక్తి కలిగిన వారు సెప్టెంబరు 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కరీంనగర్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కరీంనగర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలోని ఆసక్తి ఉన్న ఔత్సాహికులు దరఖాస్తుతోపాటు లక్ష రూపాయల చలానా, ఆధార్, హోటల్/రెస్టారెంట్/బార్/క్లబ్‌లకు సంబంధించిన జిరాక్స్ కాపీలు జత చేసి దరఖాస్తు కరీంనగర్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఇవ్వాల్సి ఉంటుంది. హోటళ్లు, రెస్టారెంట్లు వంటివి లేని వారు కొత్తగా మైక్రోబ్రూవరీ యూనిట్ ఏర్పాటు చేసే స్థలానికి సంబంధించిన పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకోవడానికి సమర్పించే లక్ష రూపాయల చలాన్ నాన్ రిఫండబుల్‌గా ఉంటుంది. అంటే దరఖాస్తు ఫీజుగా పరిగణిస్తారు. దరఖాస్తులకు, మైక్రో బ్రూవరీలకు పరిమితి లేదు. ఎన్ని కావాలంటే అన్ని యూనిట్లకు ఎక్సైజ్ శాఖ లైసెన్స్‌లు జారీ చేసేందుకు సిద్ధంగా ఉంది. లైసెన్స్ తీసుకున్న తరువాత మైక్రో బ్రూవరీ యూనిట్ ఊర్పాటుకు 180 రోజుల వ్యవధి నిర్దేశించారు. ఈ వ్యవధిలో యూనిట్ ఏర్పాటు చేసుకోనట్లయితే లైసెన్స్ గడువు ముగిసి రద్దు అవుతుంది. వెయ్యి చదరపు మీటర్ల విస్తీర్ణంలో యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవాలి. 100 చదరపు మీటర్లలో రెస్టారెంట్, 300 చదరపు మీటర్లలో మైక్రోబ్రూవరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవాలి. మిగతా స్థలంలో కిచెన్, లాయిలెట్స్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. 250 చదరపు మీటర్లలో పార్కింగ్ స్థలం ఉండాలి. రెస్టారెంట్‌లో ఎయిర్ కండిషన్, ఎయిర్ కూలింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలి. ఏడాదికి ఐదు లక్షల ఫీజు చెల్లించాల్సి ఉండగా, కోటి రూపాయలపైగా ఖర్చు అయ్యే మైక్రోబ్రూవరీ యూనిట్ మాత్రం లైసెన్స్‌దారుడే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మైక్రో బ్రూవరీలో తయారు చేసిన బీరును అక్కడే విక్రయించాల్సి ఉంటుంది. ఇతర ప్రాంతాల్లో బయట అమ్మేందుకు వీల్లేదు. కాల వ్యవధిలోపు విక్రయం జరగకుంటే ఆ బీరును పారబోయాల్సి ఉంటుంది. కరీంనగర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మైక్రోబ్రూవరీల ఏర్పాటు కోసం ఈ నెల 2న నోటిఫికేషన్ జారీకాగా ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా అందలేదు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు జరిపారు. అంతకు ముందు భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. ఆలయాలకు చేరుకుని అభిషేకం, అర్చన, హోమం, నిత్య కళ్యాణం టిక్కెట్లు కొనుగోలు చేసి పూజలు చేయించారు. స్వామివారలను దర్శనం చేసుకున్నారు. రావి చెట్టు అంజనేయస్వామి చుట్టు ప్రదక్షిణలు చేశారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారలకు అభిషేకాది పూజలు నిర్వహించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఆధ్వ ర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్య, నంబి నరసింహమూర్తి, ద్యావళ్ల విశ్వనాథ శర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో..

మల్యాల: కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. కొండపైకి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు ఆలయంలో స్వామి వారికి అర్చకులు అభిషేకం, నిత్య పూజలు నిర్వహించారు. సినీ నటుడు రాజేశ్ శనివారం అంజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, ఇతర అధికారులు పర్యవేక్షించారు.



కొండగట్టులో అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

'యాత్రాదానం'లో భాగస్వాములు కావాలి

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు

భగత్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన యాత్రాదానం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను ప్రసిద్ధ దేవాలయాలకు పర్యాటక ప్రాంతాలకు, విహార యాత్రలకు తీసుకు వెళ్లవచ్చన్నారు. సమాజ హితానికి ప్రజాప్రతినిధులు, కార్పొరేట్ సంస్థలు, ఎన్‌జీవోలు యాత్రాదానం కార్యక్రమంలో దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సేవలను అందిస్తున్న ఆర్టీసీ యాత్రాదానం కింద బస్సుల బుకింగ్ కోసం స్థానిక ఆర్టీసీ డిపో అధికారులను సంప్రదించాలన్నారు. ఆర్టీసీ హెల్ప్‌లైన్ నంబర్లు 04069440000, 04023450033కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే ఆర్టీసీ అధికారులు యాత్రాదానం టూర్ ప్యాకేజీల వివరాలను అందిస్తారన్నారు. టీజీఎస్‌ఆర్టీసీ ద్వారా దైవదర్శనం, విహారయాత్రకు యాత్రాదదానం చేయాలని కోరారు.

అంతర్జాతీయ క్రీడా సదస్సుకు అశోక్‌కుమార్



కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మలేషియాలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న అంతర్జాతీయ క్రీడా సదస్సుకు ఉమ్మడి జిల్లాకు చెందిన గుగులోత్ అశోక్ కుమార్ ఎంపికయ్యారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్, సైన్స్ ఆధ్వర్యంలో జరగనున్న మొదటి అంతర్జాతీయ సదస్సుకు హాజరుకానున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఆయన గతంలో కరీంనగర్‌లో రెజ్లింగ్ కోచ్‌గా, డీవైఎస్‌వోగా విధులు నిర్వహించారు. ఓ రెజ్లింగ్ క్రీడాకారుడిపై ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో రీసెర్చ్ చేస్తున్న సందర్భంగా అశోక్‌కు వచ్చిన ఆహ్వానం మేరకు ఆయన ఈ సదస్సులో పాల్గొననున్నారు. క్రీడారంగంలో విశిష్ట సేవలందించి రాబోయే తరానికి అశోక్‌కుమార్ ఒక స్ఫూర్తిగా ఉండాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి ఆయనను అభినందించారు.

కొండగట్టుకు రావాలని చిన్నజీయర్‌స్వామికి ఆహ్వానం

మల్యాల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి రావాలని ఆలయ అధికారులు, అర్చక బృందం త్రిదండి చిన్నజీయర్‌స్వామిని కోరారు. హైదరాబాద్ ముచ్చింతల్‌లో గల సమత మూర్తి ఆశ్రమంలో కలిసి కొండగట్టులో నిర్వహించనున్న వేడుకలకు రావాలని ఆహ్వానించారు. జీయర్‌స్వామిని కలిసిన వారిలో ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, ఆలయ స్థానాచార్యులు కపీందర్, ఉపప్రధానార్చకులు చిరంజీవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ అశోక్, అర్చకులు తదితరులు ఉన్నారు.

అంజన్న సన్నిధిలో 'కార్పం' సినిమా బృందం

మల్యాల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న నూతన సినిమా కార్పం చిత్రబృందం శనివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుంది. చిత్రం స్క్రిప్ట్‌తో స్వామి వారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చిత్రబృందంను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా బృందసభ్యులు మాట్లాడుతూ తెలంగాణ యాస, భాషతో ఇక్కడి సంప్రదాయలను ఈ సినిమాతో తెరకెక్కించనున్నట్లు తెలిపారు. కొండగట్టు ప్రాంతంలో సినిమా షూటింగ్ ఉంటుందని తెలిపారు.

కూతురు అపాయంలో ఉందంటూ సైబర్ నేరస్థుల ఫోన్

● అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ

హుజూరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మీ కూతురు ఓ కేసులో ఇరుక్కుంది.. డబ్బులు పంపించాలని అనడంతో అప్రమత్తమైన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన హుజూరాబాద్‌లో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హుజూరాబాద్ పట్టణానికి చెందిన నుస్రత్ కూతురు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఓ పోలీస్ అధికారి డీపీతో సైబర్ నేరగాళ్లు నుస్రత్‌కు ఫోన్ చేసి మీ కూతురు ఓ కేసులో ఇరుక్కుందని, రూ. 30 వేలు ఫోన్ పే ద్వారా చెల్లిస్తే సమస్య పరిష్కరిస్తామన్నారు. అప్రమత్తమైన సదరు మహిళ కళాశాలకు వెళ్లి కూతురును కలిసింది. ఈ విషయాన్ని తన భర్తకు తెలపడంతో సైబర్ నేరగాళ్ల పని అని పోలీస్‌స్టేషన్లో టౌన్ సీఐ కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. అనంతరం సీఐ కరుణాకర్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కిరాణాషాపులో చోరీ

బీర్‌పూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీర్‌పూర్ మండలం తాళ్ళధర్మారం గ్రామానికి చెందిన నల్ల మహిపాల్ రెడ్డి అనే వ్యక్తి కిరాణం షాపులో శుక్రవారం రాత్రి దొంగతనం జరిగింది. దుండగులు షాపు తాళం పగులకొట్టి కౌంటర్‌లోని నలభై వేల రూపాయలు, అర్థ తులం బంగారం ఎత్తుకెళ్లారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ధర్మపురి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని జీవన్ అనే వ్యక్తి మృతి చెందాడు. ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం రుద్రాపూర్ గ్రామానికి చెందిన జీవన్ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జీవన్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు ఎక్కడ నుంచి ఎక్కడికి వెళుతున్నాడో, ఏ పని చేస్తాడో తెలియాల్సి ఉంది. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ సందర్శించి విచారణ చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్‌లో శనివారం ఒక ఇంటిపై దాడి చేసి తొమ్మిది మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నామని కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. పట్టుబడినవారి వద్ద నుంచి 21,400 రూపాయలు, 10 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు

- 22 గేట్ల ద్వారా దిగువకు 1,14,680 క్యూసెక్కులు నీరు

జగిత్యాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లు మళ్లీ తెరుచుకున్నాయి. శనివారం 22 గేట్లు ఎత్తి 1,14,680 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 1,32,395 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకుగాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 8,000 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,500 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 684 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.



గోదావరిలోకి పరుగులు పెడుతున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీరు

253విఎండి13: మిడ్ మానేరు ప్రాజెక్టు

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయానికి (మిడ్ మానేరు) శనివారం 10,600 ఇన్‌ఫ్లో కొసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 9800, మానేరు ములవాగు ద్వారా 800 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్యాకేజి 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400, ప్యాకేజి 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.80 ఉండగా, సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.042 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

● అన్నపూర్ణ రిజర్వాయర్‌లో..

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.04టీఎంసీలకు చేరుకుంది. మధ్యమానేరు ద్వారా వస్తున్న 6,400క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6,600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎల్‌ఎండీకి తగ్గిన ఇన్‌ఫ్లో..

తిమ్మాపూర్: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఎల్‌ఎండీ రెండు గేట్ల ద్వారా 8,309 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి ఇన్‌ఫ్లోలు 10,314 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నాయి. ఎల్‌ఎండీ రెండు గేట్ల ద్వారా 4000 క్యూసెక్కుఉలు, కాకతీయ కెనాల్ ద్వారా 4000 క్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 309 క్యూసెక్కులు నీరు అవుట్‌ఫ్లో వెళ్తోందని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి

- ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి
- రాజన్న సిరిసిల్ల ఎస్పీ మహేష్ బీ గితే





పనులను పరిశీలిస్తున్న ఎస్పీ, సినీనటుడు రాజేశ్‌కు ప్రసాదం అందజేస్తున్న అర్చకుడు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ అనుబంధమైన శ్రీభీమేశ్వరాలయానికి వచ్చే భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ మహేష్ బిగితే అన్నారు. భీమేశ్వరాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో క్యూలైన్స్, వీఐపీ దర్శనం, కోడెమొక్కుల దర్శనం, వీఐపీ రోడ్డు, పార్కింగ్‌స్థలాలు, భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్, టాఫిక్ ఆర్‌ఎస్‌ఐ రాజు, ఈఈ రాజేష్, డీఈ మైపాల్‌రెడ్డి, ఏఈవో శ్రావణ్‌కుమార్, ఏఈ నాగరాజు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌లతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో ఎస్పీ పూజలు

భీమేశ్వరాలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఎస్పీ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వాదం ఇచ్చి ప్రసాదం అందజేశారు.

రాజన్నను దర్శించుకున్న సినీనటుడు..

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని సినీ నటుడు రాజేష్ శనివారం దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు ఆశీర్వాదం ఇచ్చి రాజన్నప్రసాదం అందజేశారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల యాజమాన్యాల సమావేశం

జమ్మికుంట సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని న్యూమిలినియం పాఠశాలలో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ బెస్ట్ అబైలబుల్ పాఠశాల యాజమాన్యాల సమావేశం నిర్వహించారు. కొన్నిసంవత్సరాలుగా పాఠశాలల కు రావల్సిన బాకాయిలు పెండింగ్ అంశాలపై చర్చించారు. ఇంటర్ మీడియ ట్, డిగ్రీ కళాశాలల యాజమాన్యాల వలే పాఠశాలల యజమాన్యాలు సైతం సహాయ నిరాకరణ బాటలో పయనించాలని నిర్ణయించారు. ముఖ్య అతిథిగా ట్రస్మా మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు పాల్గొని మాట్లాడుతూ 18వ తేదీలోపు బకాయిలు చెల్లించని పక్షంలో తదుపరి కార్యచరణ ప్రకటిస్తామని అన్నారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోరం సంజీవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటు ముసిపట్ల తిరుపతిరెడ్డి, జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు పూల్లూరి సంపత్‌రావు, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రైవేటు స్కూల్ యజమానులు

రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులపై జీఎం అసంతృప్తి

పెద్దపల్లి, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో నత్తనడకన జరుగుతున్న అమృత్ స్టేషన్ ఆధునికీకరణ పనులపై దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఆయన మంచిర్యాల, రామగుండం రైల్వేస్టేషన్లను పరిశీలించిన అనంతరం డీఆర్‌ఎం రాధాకృష్ణతో కలిసి పెద్దపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఇక్కడ 22కోట్ల రూపాయలతో రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో తీవ్రమైన జాప్యం జరుగుతున్నది. పనుల్లో ఏమాత్రం వేగం పుంజుకోవడం లేదు. పనుల్లో జరుగుతున్న జాప్యంపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను జీఎం ప్రశ్నించారు. పనుల్లో వేగం పెరగకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్ణీత గడువులోగా రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులను పూర్తి చేసి ప్రయాణికులకు స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా తాత్కాలికంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌యూసీసీ మెంబర్ ఎన్‌డీ తివారి జీఎంకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఇక్కడ వివిధ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని తివారితోపాటు విష్ణు ప్రకాశ్, మాలని, దీపరాం, పూరారామ్, పన్నాలాల్, నైన్ సింగ్ తదితరులు జీఎంను కోరారు.

రామగుండం రైల్వేస్టేషన్ సందర్శించిన జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

అంతర్గాం: రామగుండం పట్టణంలోని రైల్వేస్టేషన్‌ను శనివారం దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ సందర్శించారు. ఈ సందర్భంగా జీఎం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలు, పార్కు, పార్కింగ్ స్టాండ్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనే రైల్వేసంస్థ ప్రధానలక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుందనపల్లి, పెద్దంపెట్, కన్నాల వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరుతూ రామగుండం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణిపోచం వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా రామగుండం రైల్వేస్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలని కోరుతూ రైల్వేబోర్డు మెంబర్ అనుమాన శ్రీనివాస్



పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో పనుల మ్యాపులను పరిశీలిస్తున్న రైల్వే జీఎం

జీన్స్ పలు కార్మిక సమస్యలు పరిష్కరించాలని రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు, రైల్వే సంఘ్ యూనియన్ నాయకులు జీఎంకు వినతిపత్రాలు అందజేశా రు. అనంతరం జీఎం రైల్వే అధికారులతో కలిసి గోదావరిఖనిలోని సింగరేణి, ఎన్‌టీపీసీ, రైల్వే సైడింగ్‌లను తనిఖీచేశారు. కార్యక్రమంలో డివిజనల్ రైల్వేమేనేజర్ గోపాల్‌కృష్ణన్, స్టేషన్‌మాస్టర్ మీనా, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ శ్రీమన్నారాయణ, రవికుమార్, ఆర్‌పీఎఫ్ సీఐ లింగమయ్య, యూనియన్ నాయకులు యాదగిరి స్వామి, రాథోడ్ ఆనంద్, అజ్మీరా వీరన్న తదితరులు పాల్గొన్నారు.

చిన్న నీటి వనరుల.. సర్వేపై జాప్యం

(5వ పేజీ తరువాయి)

వద్దకు వెళ్లి సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న యాప్ ఓపెన్ చేసి వివరాలను నమోదు చేయాలి. చెరువులు, కుంటల వద్దకు వెళ్లి అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా జియో ట్యాగింగ్‌తో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. మొదట 100ఎకరాల లోపు ఆయకట్టు గల నీటి వనరులపై సర్వేచేసి, ఆ తర్వాత 100 ఎకరాలకు పైగా ఉన్న వాటి గురించి సర్వే చేయనున్నారు. 250ఎకరాల ఆయకట్టుకు పైబడిన వాటి గురించి వేర్వేరుగా సర్వే నిర్వహించనున్నారు. ఇవేగాకుండా బిందు, తుంపర సేద్యంలో నీటి లభ్యత, నిల్వ సామర్థ్యం, విద్యుత్ వాడకం, పంటల వివరాలను కూడా సేకరించాల్సి ఉంటుంది. వ్యవసాయశాఖ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 1090చెరువులు, కుంటలు ఉన్నాయి. 24,172వ్యవసాయ బోర్‌వెల్స్ 43,049 వ్యవసాయ బావులు ఉన్నాయి. వీటిద్వారా 1,51,854ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. గ్రామాల్లో చిన్నచిన్న కుంటలు కబ్జాకు గురై కనుమరుగయ్యాయి. కాగితాల్లో ఉన్న లెక్కల ప్రకారం క్షేత్ర స్థాయిలో నీటి వనరులు కనబడడం లేదు. ఈ సర్వే ద్వారా జిల్లాలో సజీవంగా ఎన్ని చెరువులు, కుంటలు ఉన్నాయో తెలియనున్నది. ఈసారి సర్వే వివరాలను యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండడంతో పక్కాగా జరగనున్నది. సర్వేద్వారా వెల్లడయ్యే వివరాలప్రకారం చిన్ననీటి వనరులను కాపాడుకునేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించనున్నది. ఈసర్వే ఒక్కకేంద్ర ప్రభుత్వానికే గాకుండా, రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఉపయోగపడనున్నది. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సీపీవో గంప రవీందర్‌ను సంప్రదించగా చిన్న నీటివనరుల సర్వే ప్రస్తుతం ఎంపీఎస్‌వోల ద్వారా మండలానికి రెండు గ్రామాల్లో చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత ఆయాశాఖల సిబ్బందితో కలిపి అన్ని గ్రామాలు, పట్టణాల్లో సర్వే చేస్తామని చెప్పారు.

కక్షిదారులకు రాజీ మార్గమే రాజ మార్గం

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

మంథని, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులకు రాజీమార్గమే రాజమార్గమని పెద్దపల్లిజిల్లా ప్రధాననాయ్యమూర్తి సునీత కుంచాల స్పష్టం చేశారు. మంథని కోర్టు ఆవరణలో శనివారంజరిగిన జాతీయ మెగాలోక్ అదాలత్‌లో జిల్లా ప్రధానన్యాయమూర్తి సునీత మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో కక్షిదారులు ఇరువురు స్నేహపూర్వ వాతావరణంలో కలుసుకొని వారి సమస్యలను పరిష్కరించుకోవడం సంతోషకరమన్నారు. లోక్ అదాలత్‌లో 271 వివిధ రకాల కేసులు పరిష్కారం అయ్యాయన్నారు. కార్యక్రమంలో మంథని సీనియర్ సివిల్ జడ్జి వీ భావని, అడిషనల్ జూనియర్‌సివిల్‌జడ్జి ఏ సుధారాణి, ద్వితీయశ్రేణి న్యాయాధికారి అనురాధ, ఆర్డీవో సురేష్, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడుహరిబాబు, తహసీల్దార్ కుమారస్వామి, న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం..

- జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్

సుల్తానాబాద్: లోక్‌అదాలత్‌తో ఇరువర్గాలకు సత్వర న్యాయం అందుతుందని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్‌జడ్జి దుర్గం గణేష్ అన్నారు. శనివారం జాతీయలోక్‌అదాలత్ పురస్కరించుకుని మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మున్సిఫ్ కోర్టుఆవరణలో లోక్‌అదాలత్ నిర్వహించారు. పలు క్రిమినల్, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు తదితరకేసులను పరిష్కరించినట్లు కోర్టుఅధికారులు తెలిపారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బోయినిభూమయ్య, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ నేరెళ్లశంకరయ్య, లోక్‌అదాలత్ సభ్యులు మాదూరి ఆంజనేయులు, చీకటి సంతోష్‌కుమార్, న్యాయవాదులు పడాల శ్రీరాములు, ఒడ్నాల రవీందర్, జోగుల రమేష్, ఆవునూరి సత్యనారాయణ, ఆవులశివకృష్ణ, సామాల రాజేంద్రప్రసాద్, మల్యాల కరుణాకర్, స్నేహ, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు యూరియా బస్తాల పంపిణీ


యూరియా బస్తాల పంపిణీ వద్ద రైతులు

ఎలిగేడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాకల్‌దేవుపల్లి గ్రామరైతులకు శనివారం 270యూరియా బస్తాలను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఉమాపతి, సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. గ్రామాల్లోని రైతులంతా యూరియాపై ఆధారపడకుండా దీనికి సమానంగా ఫలితాలను ఇచ్చే నానోయూరియాను ఉపయోగించి పంట దిగుబడులను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఈవో విక్రమ్, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, ఏఈవోలు గణేష్, సురేష్, శరణ్య, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ టీచర్‌ను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే


భరత్‌రెడ్డిని సన్మానిస్తున్న పుట్ట మధు

మంథని, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉత్త మఉపాధ్యాయుడిగా హైదరా బాద్‌లో అవార్డు పొందిన గీట్ల భరత్‌రెడ్డిని మాజీఎమ్మెల్యే పుట్టమధు శనివారం సన్మానిం చారు. గీట్ల భరత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన పుట్టమధు ప్రత్యేకంగా అభి నందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. విద్యారంగంలో ఉత్తమసేవలు అందించిన గీట్ల భరత్‌రెడ్డికి రాష్ట్ర స్థాయిలో ఉత్తమటీచర్ అవార్డు అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్య క్రమంలో బీఆర్ఎస్ నేతలు తగరం శంకర్‌లాల్, జంజర్ల శేఖర్, కనవేన శ్రీనివాస్, గొబ్బూరి వంశీ, పుప్పాల తిరుపతి, ప్రకాష్‌రెడ్డి, సమ్మయ్య, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోతుల పట్టివేత

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

మంథనిరూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంథని ప్రాంతంలో కోతుల నివారణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈనెల 10న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'వణికిస్తున్న వానరాలు.. పరుగులు పెట్టిస్తున్న శునకలు' అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో స్పందించిన మున్సిపాల్ అధికారులు పట్టణంలో శనివారం వాటి నివారణ చర్యలు చేపట్టారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన కొంతమందితో ప్రత్యేకబోనులు ఏర్పాటు చేసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో కోతులు పడుతున్నారు. పట్టుకున్న కోతులను మంచిర్యాలజిల్లా జన్నారం అడవులకు తరలించ నున్నారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


బోనులో పట్టుకున్న కోతులు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలే

● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి

రామగిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి హెచ్చరించారు. శనివారం సెంటినరీకాలనీ అంగన్వాడీ టీచర్స్‌అండ్‌హెల్పర్స్ యూనియన్ జిల్లా 4వ మహాసభను వనజారాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ప్రధానకార్యదర్శి జ్యోతి హాజరై మాట్లాడారు. అంగన్వాడీ టీచర్స్‌అండ్‌హెల్పర్స్ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు. కనీసవేతనం చట్టబద్ధహక్కులను అమలు చేయకుండా వెట్టిచాకిరి చేపిస్తున్నారని విమర్శించారు. సమస్యల పరిష్కారంకోసం ఈనెల15నుంచి దశలవారీ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లాకార్యదర్శి ముత్యంరావు జిల్లాఉపాధ్యక్షుడు కొమురయ్య, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కమాన్‌పూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూలపల్లిలోని మల్లికార్జుననగర్‌లో సీసీరోడ్డు పనులను శనివారం మాజీఎంపీటీసీ శేవ్వశంకరయ్యప్రారంభించారు. రోడ్డునునాణ్యతతో నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

సింగరేణిలో ఇక మహిళా ఈపీ ఆపరేటర్లు

● సర్క్యులర్ జారీ చేసిన యాజమాన్యం

గోదావరిఖని, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మహిళాఉద్యోగులను ఈపీ ఆపరేటర్లుగా మార్చుకునేందుకు యాజమాన్యం అడుగులువేసింది. ప్రస్తుతం జనరల్ అసిస్టెంట్, బదిలీవర్కర్లుగా పనిచేస్తున్న మహిళలకు సింగరేణి యాజమాన్యం ఓపెన్‌కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పని చేయ డానికి ఎంపిక కోసం దరఖాస్తుల్ని ఆహ్వానించింది. మైనింగ్ రంగంలో మహిళల సాధికారత, సమానఅవకాశాలు, మానవ వనరుల సమర్థ వినియోగంలో భాగంగా సీఎండీ ఎన్ బలరాంనాయక్ ఆదేశాలమేరకు ఈనిర్ణయం తీసుకున్నారు. శనివారం సింగరేణియాజమాన్యం అన్ని గనులకు, డిపార్ట్‌మెంట్లకు సర్క్యులర్ విడుదల చేసింది. ఓపెన్‌కాస్ట్ గనుల్లో మహిళలకు భారీయంత్రాలపై ఆపరేటర్లుగా పనిచేసేఅవకాశం ఇవ్వడం సింగరేణి చరిత్రలో ఇదే తొలిసారి. ప్రస్తుతం జనరల్ అసిస్టెంట్, బదిలీ వర్కర్‌గా పనిచేస్తున్న 35సంవత్సరాల లోపు వయసు ఉండి కనీసం 7వ తరగతి పాసైన మహిళా అభ్యర్థులు ఈ ఆపరేటర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చు అని యాజమాన్యం సర్క్యులర్‌లో పేర్కొంది. దరఖాస్తు చేసుకునే మహిళలు శారీరక సామర్థ్యం కలిగి ఉండాలని, కనీసం ద్విచక్ర లేదా నాలుగు చక్రాల వాహన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఆగస్టు 2024 కన్నా ముందు డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని యాజమాన్యం పేర్కొంది. దరఖాస్తుల స్వీకరణ తర్వాత జనరల్ మేనేజర్ సీపీపీ నేతృత్వంలోని ఒకకమిటీ దరఖాస్తులను పరిశీలించి కనీసఅర్హతలు గల అభ్యర్థులను ఎంపిక చేస్తారు. కమిటీ ఎంపికచేసిన అభ్యర్థులు సిరిసిల్లలో గల తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ సంస్థ హెవీ గూడ్స్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్ విభాగంలో శిక్షణ పొందాల్సి ఉంటుంది. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఖాళీల లభ్యతను బట్టి నిర్వహించే ఎంపిక పరీక్షలో ఉత్తీర్ణులు అయిన వారిని ఈపీ ఆపరేటర్ ట్రైనీ కేటగిరి-5 డిసిగ్నేషన్‌తో పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఆసక్తిగల మహిళా ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవలసిందిగా యాజమాన్యం సర్క్యులర్‌లో పేర్కొన్నది.

ఓసీపీ-3 ప్రాజెక్టును సందర్శించిన రైల్వే జీఎం


సంజయ్‌కుమార్ శ్రీవాస్తవకు మొక్కను అందజేస్తున్న ఆర్జీ-2 జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ శనివారం ఓసీపీ-3 ప్రాజెక్టును సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్‌మూమెంట్) వెంకన్న జాదవ్‌తో కలిసి సందర్శించారు. ప్రాజెక్టు వ్యూపాయింట్ ఆవరణలో పండ్ల మొక్కలు నాటారు. అనంతరం వ్యూపాయింట్ నుండి క్వారీలో బొగ్గు వెలికితీత పనులను రైల్వే జీఎం పరిశీలించారు. సర్వే మ్యాప్ ద్వారా ప్రాజెక్టు పనిస్థలాలు, రవాణా వివరాలను పీవో ఉదయ్ హరిజన్ రైల్వేజీఎంకు వివరించారు. ఓసీపీ-3 నుంచి బొగ్గు రవాణా స్థితిగతులను, నిర్దేశిత లక్ష్యాలపై ప్రాజెక్టు అధికారులతో మాట్లాడారు. బొగ్గుసరఫరాలో ఆటంకాలు ఏర్పడకుండా, రేకుల లభ్యత ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని రైల్వే జీఎం సూచించారు. కాగా ఆర్జీ-2జీఎం బండి వెంకటయ్య రవాణా మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యలను రైల్వే అధికారులకు వివరించారు. రైల్వే జీఎం వెంట సౌత్ సెంట్రల్ రైల్వే సెక్రెటరీ ఎం శ్రీనివాస్, డీఆర్ఎం గోపాల్ కృష్ణన్, ఆర్జీ-2 ఎస్వోటూజీఎం రాముడు, డీజీఎం మురళీకృష్ణ, పీఈ రాజాజీ, మేనేజర్ భరత్ కుమార్ ఉన్నారు.

యూనియన్లు కార్మికులకు క్షమాపణ చెప్పాలి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కారణాలతో బొగ్గు గనుల వేలంలో పాల్గొనకుండా అడ్డుకుని సింగరేణి భవిష్యత్తును సంకట స్థితిలో పడేసిన యూనియన్లు కార్మికులకు క్షమాపణ చెప్పాలని బీఎంఎస్ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ వడ్డెపల్లి కుమారస్వామి ప్రకటనలో డిమాండ్ చేశారు. కంపెనీ భవి ష్యత్తు, కార్మికుల శ్రేయస్సును పట్టించుకోకుండా కేవలం తమ అనుకూల రాజకీయ పక్షాల ఉనికి కాపాడుకోడానికి గనుల వేలంపై దుష్ప్రచారం చేశాయని ఆరోపించారు. బాధ్యాతా రాహిత్యంగా వ్యవహరించిన కార్మికసంఘాలు ఇప్పటికైనా సింగరేణి మనుగడకు అడ్డుతగలకుండా ఉంటే మంచిదని సూచించారు. వేలంలో పాల్గొనని కారణంగా సింగరేణి 60వేల కోట్ల నష్టం జరిగిందని, రాష్ట్రంలోని గనులు చేజారిపోయినట్టు కుమారస్వామి తెలిపారు. నష్టాన్ని గమనించి వేలం ప్రక్రియలో పాల్గొనాలని సింగరేణి నిర్ణయం శుభపరిణామమని, రాజకీయ పార్టీల పావులుగా మారి సంస్థకు నష్టంచేసిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, టీబీజీకేఎస్‌లు కార్మికులకు క్షమాపణలు చెప్పాలని కుమారస్వామి ప్రకటనలో డిమాండ్ చేశారు.

పదేళ్లు సింగరేణిని వంచించారు..

● ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్

గోదావరిఖని, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కల్వకుంట్ల కవిత గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న టీబీజీకేఎస్ యూనియన్ నాయకులు 10ఏళ్ల సింగరేణిని వంచించి, కార్మికుల రక్తం పీల్చారని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఒక ప్రకటనలో అన్నారు. సింగరేణిలో అవినీతి గురించి కవిత మాట్లాడటం అంటే.. దయ్యాలు వేదాలు వల్లించినట్టేనని అన్నారు. కోల్‌బెల్ట్ వ్యాప్తంగా కార్మికులు ఎమ్మెల్యే, ఎంపీలను చిత్తుగా ఓడించి, గత గుర్తింపు సంఘం ఎన్నికల్లో టీబీజీఎస్‌ను కనీసం పోటీచేయని పరిస్థితికి తీసుకవచ్చారన్నారు. కవిత పార్లమెంట్ సభ్యురాలిగా ఉన్నప్పుడు కేంద్రం తీసుకొచ్చిన కుట్రపూరిత ఎంఎండీఆర్ చట్టానికి మద్దతు తెలిపింది మీరు కాదా అని, బొగ్గు గనుల వేలంలో సింగరేణిని పాల్గొనకుండా కుట్ర చేసి, మీ పార్టీ బినామీలకు బొగ్గు బ్లాకులు వెళ్లేలా పరోక్షంగా వ్యవహరించింది మీ పార్టీ కాదా జనక్ ప్రసాద్ ప్రశ్నించారు. దాని వల్ల సంస్థకు రూ.60వేల కోట్ల భారీ నష్టం వాటిల్లింది ఇది నిజం కాదా అన్నారు. ఇంట్లో పంచాయితీతో కొత్త కుంపటి పెట్టి ఇప్పుడు కార్మికుల మీద కపట ప్రేమ చూపించడం ఏమిటని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే సింగరేణి ఎప్పుడూ లేని విధంగా రికార్డు స్థాయి ఉత్పత్తి, రవాణా, లాభాలు సాధించిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంపై అనవసర విమర్శలు మాని కార్మికుల శ్రేయస్సు కోసం పనిచేయాలని సూచించారు.



ఇచ్చిన హామీలను విస్మరించిన సంఘాలు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలను గెలిచిన సంఘాలు విస్మరించినట్టు టీబీజీకే ఎస్ ఆర్జీ-2 వైస్‌ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం వకీల్‌పల్లె గనిని సందర్శించిన టీబీజీకేఎస్ బృందం గని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా అయిలి శ్రీనివాస్ మాట్లాడారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు గెలిచి ఇరవై ఒక్క నెలలు గడుస్తున్నా ఒక్క హామీని కూడా అమలు చేయలేదని అన్నారు. ప్రభుత్వం నుంచి పెండింగ్ బకాయిలు తీసుకువస్తామని చెప్పిన సంఘాలు 25 కోట్లకు పైగా బాకీలు పేరుకుపోయినా స్పందించే స్థితిలో లేవన్నారు. ఏఐటీయూసీ 47హామీలు ఇవ్వగా, ఐఎన్‌టీయూసీ 36హామీలు ఇచ్చిందని, వాటిలో ఎన్ని అమలయ్యాయో కార్మికులు గుర్తించాలని అయిలి శ్రీనివాస్ సూచించారు. కార్యక్రమంలో పిట్ సెక్రెటరీ వెంకటేశం, నాయకులు హరిప్రసాద్, రవితేజ, కాసిం, వెంకటస్వామి, సురేందర్, రాజారాం, రాములు, శ్రీనివాస్, రాంచరణ్, రంజిత్, వినోద్, గంగాధర్ పాల్గొన్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న అయిలి శ్రీనివాస్

రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ పెంచాలి

● సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌతం


సమావేశంలో రిటైర్డ్ కార్మిక సంఘం నేతలు

రామగిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్‌ను రూ.15వేలు పెంచాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌతంశంకరయ్య డిమాండ్ చేశారు. శనివారం సెంటినరీకాలనీలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రిటైర్డ్‌కార్మికుడికి పెన్షన్ రూ.15వేలు చెల్లిస్తూ ప్రతి మూడు సంవత్సరాల ఒకసారి రివైజ్ చేయాలని కోరారు. రిటైర్డ్ కార్మికులకు ఆరోగ్య భద్రత కల్పించాలని, మెడికల్ కార్డు పరిమితిని రూ.25లక్షల చేయాలని పేర్కొన్నారు, ఇందిరమ్మ గృహాలు, వైట్‌రేషన్‌కార్డులు కల్పించాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో రిటైర్డ్ కార్మికులతో నిరసనకార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు వేగలం మల్లయ్య, జవహర్, పట్నం సత్యనారా యణ, తోట మండయ్య, వెంకటేశ్వర్లు, రాజేశం, సంజీవ్ రెడ్డి, సలీం, సంపత్, దేవయ్యలు పాల్గొన్నారు.

జాతీయ రెస్క్యూ పోటీలకు జట్ల ఎంపిక


పురుషుల జట్టు


మహిళా జట్టు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాగ్‌పూర్‌లో నవంబరు నెలలో జరగనున్న జాతీయ రెస్క్యూపోటీలకు సింగరేణి జట్లను ఎంపికచేసినట్టు రెస్క్యూ సూపరెండెంట్ రాజేందర్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 11,12తేదీల్లో జరిగిన జోనల్‌మైన్స్‌పోటీల్లో ప్రతిభ కనబర్చిన రెస్క్యూ సభ్యుల్లో నుంచి 24మందిని ఎంపికచేసి మూడుజట్లుగా ఏర్పాటు చేశామని, ఎనిమిదిమంది చొప్పున రెండు పురుషుల జట్లు, ఒక మహిళాజట్టును ఎంపికచేసినట్టు తెలిపారు. వీరికి ప్రత్యేకశిక్షణ ఇవ్వనున్నట్టు రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు.

పురుషుల జట్టు చీర్ల రమేష్, భానుప్రసాద్, గుజ్జులరాకేష్, పిక్కల కుమారస్వామి, శ్యాంసుందర్, జే మురళి, శశాంక్, గెల్లు పరమేశ్వర్, శ్రీవిజ్ఞాన్, మధుసూదన్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్, రెడ్డిరాజుల అజయ్, మహమ్మద్ గౌస్‌పాష, రేణికుంట్ల సురేష్, బాకిసురేష్, శ్రీనివాసరెడ్డి. మహిళాజట్టులో అంబటి మౌనిక, మాలోతు అనూష, వీసంకృష్ణవేణి, లక్కంస్వాతి, శ్రీరాం స్వాతి, బానోతుచందనా జవేరి, దుడెల శైని ఉన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం వహించడాన్ని ఖండిస్తున్నట్టు ఏఐటీయూసీ ఆర్జీ-2 సెక్రెటరీ జిగురు రవీందర్ అన్నారు. శనివారం ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంతింటి పథకం అమలు, పెర్క్స్‌పై ఐటీ రీయింబర్స్ చేయడం, మారుపేర్ల సమస్య, మెడికల్‌బోర్డు నిర్వహణ అస్తవ్యస్తంగా మారి కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా యాజమాన్యం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండడం సరికాదన్నారు. ఇప్పటికైనా పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని రవీందర్ డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ప్రకాష్, రాజారత్నం, అన్నారావు, మహేందర్, బుర్ర తిరుపతి, సెగ్గం శంకర్, సత్యనారాయణ, లింగయ్య, నారాయణ పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ జీడీకే 1 ఇంక్లైన్ పిట్ సెక్రెటరీగా మురళీ కృష్ణ

గోదావరిఖని, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఆర్జీ-1 జీడీకే 1ఇంక్లైన్ పిట్ సెక్రెటరీగా మురళీకృష్ణను నియమించినట్టు ఆ యూనియన్ ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ చెప్పారు. శనివారం గోదావరిఖని చౌరస్తాలోని కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ నూనె కొమురయ్య మాట్లాడుతూ పిట్ సెక్రెటరీగా మురళీ కృష్ణను, అసిస్టెంట్ పిట్‌సెక్రెటరీగా ప్రదీప్‌ను నియమించామన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు పర్లపల్లి రవి, చెల్పూరి సతీష్, జనగామ మల్లేష్, జోసఫ్, శంకర్, సురేందర్, రాజశేఖర్, చంద్రయ్య, నాగరాజు, శరత్‌బాబు పాల్గొన్నారు.

డిపార్టుమెంటల్ స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

రామగిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిదీలో డిపార్టుమెంటల్ స్థాయి కబడ్డీ పోటీలను శనివారం అడ్రియాల ఏరియా ఇంజనీర్ యాదయ్య ప్రారంభించారు. వర్క్‌పీపుల్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెంటినరీకాలనీ రాణిరుద్రమాదేవి క్రీడీప్రాంగణంలో నిర్వహిస్తున్న డిపార్మెంటల్ కబడ్డీ పోటీలను ఏరియా ఇంజనీర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రారెడ్డి, శర్వాన్, సుదర్శనం, సునీల్‌ప్రసాద్, జవ్వాజి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏరియా ఇంజనీర్

సీఎండీ స్ట్రక్చర్ సమావేశాన్ని బహిష్కరించాం

● ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటి జనరల్ సెక్రెటరీ వైవీ రావు

రామగిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సంవత్సర కాలంగా గుర్తింపు సంఘంగా పలుకార్మికుల సమస్యలపై డైరెక్టర్(పా)తో చర్చించి కీలకనిర్ణయం తీసుకోవాల్సిందిగా కోరినా జాప్యం చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం సీఎండీతో జరగాల్సిన స్ట్రక్చర్ సమావేశాన్ని గుర్తింపు సంఘంగా బహిష్కరించినట్లు ఏఐటీయూసీ డిప్యూటి జనరల్ సెక్రెటరీ వైవీ రావు తెలిపారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారంపై సర్క్యులర్‌లను జారీచేయకుండా మితిమీరిన రాజకీయ జోక్యంతో సింగరేణి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రతి సమావేశాల్లో మారుపేర్ల సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీనిచ్చిన యాజమాన్యం వాటి అమలుకు అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని దాటవేసే ధోరణి అవలంబిస్తున్నట్లు ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. సొంతింటిపథకం, మెడికల్ బోర్డు, వాస్తవ లాభాలు, ఇన్‌కమ్ టాక్స్ పేర్క్స్ ఇలాంటి అనేక అంశాలపై వేరే అంశాలకు ముడిపెడుతూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నడు లేనివిధంగా ట్రాన్స్‌ఫర్ పాలసీని తీసుకువచ్చి కార్మికులను బదిలీచేసే విషయంలో కార్మికులతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. క్లరికల్‌ఖాళీలను సత్వరం పూరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యాజమాన్యం నిలదీసే కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో జూపాక రాంచందర్, ఎంఆర్సీ రెడ్డి, క్రాంతికిరణ్, డీటీ రావు, మల్లేష్, రంజిత్, గందం శ్రీనివాస్, సురేష్, సంపత్, తదితరులుప పాల్గొన్నారు.